సాక్షి
కర్నూలు
గురువారం ౹ 19 ౹ అక్టోబర్ ౹ 2023



కేసీకి నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు బుధవారం 159 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. డ్యాంలో ప్రస్తుతం 0.688 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



నోట్లతో అలంకరణ

పాణ్యం: దేవీ శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని బుధవారం పాణ్యంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు.



విశేష స్పందన

జూపాడుబంగ్లా: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. బుధవారం 80బన్నూరులో 650 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు.

న్యూస్‌రీల్

శనగ మద్దతు ధర రూ.5,440

కర్నూలు(అగ్రికల్చర్): రబీలో ప్రధాన పంట శనగ(బెంగాల్ గ్రామ్)కు మద్దతు ధర పెరిగింది. కేంద్ర ప్రభుత్వం క్వింటాకు రూ.105 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో శనగ మద్దతు ధర రూ.5,440కి చేరింది. రబీలో పండించిన శనగకు ధర పడిపోయినప్పుడు కేంద్రం నాఫెడ్ ద్వారా రూ.5,440 మద్దతు ధరతో కొనుగోలు చేయనుంది.

క్వింటా ఉల్లి రూ.3,130

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో ఉల్లి ధర క్రమంగా పెరుగుతోంది. మార్కెట్‌కు బుధవారం 57 మంది రైతులు 1,566 క్వింటాళ్ల ఉల్లి విక్రయానికి తీసుకొచ్చారు. కనిష్ట ధర రూ.1,140, గరిష్ట ధర రూ.3130.. మోడల్ ధర రూ.2,469 నమోదైంది. ఈ నెల 16న గరిష్టంగా రూ.2,915, 17న 2,889 ప్రకారం ధర లభించింది. తాజాగా రూ.3130లకు చేరుకోవడం విశేషం. ఈ ఏడాది వర్షాభావం వల్ల దిగుబడులు తగ్గినా ధర మెరుగ్గా ఉండటంతో రైతులు ఊరట చెందుతున్నారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి

- రైల్వే డీఆర్‌ఎంకు ఎమ్మెల్యే కాటసాని విజ్ఞప్తి



డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: నియోజకవర్గంలో రైల్వేకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని దక్షిణమధ్య రైల్వే డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్‌కు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విన్నవించారు. బుధవారం పాణ్యం రైల్వే స్టేషన్ తనిఖీకి వచ్చిన డీఆర్‌ఎంను ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా ఆయన పాణ్యం రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని, రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. వీటితో పాటు వీలైనంత త్వరగా నెరవాడ అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. కొలూరు గేటు సమస్యను కూడా పరిష్కరించాలన్నారు. వీటిపై డీఆర్‌ఎం సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే వెంట మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, డీసీబీ మనోజ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

త్వరలో కొలనుభారతి ఆలయ పునర్నిర్మాణం



ఆలయాన్ని పరిశీలిస్తున్న దేవదాయశాఖ అధికారులు

కొత్తపల్లి: శివపురం గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన కొలనుభారతిదేవి ఆలయ పునర్నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని రాయలసీమ జోన్ దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ అన్నారు. దేవీనవరాత్రుల్లో భాగంగా బుధవారం ఆలయంలోని సరస్వతీదేవిని ఆయన దర్శించుకున్నారు. ఆలయ ఈఓ మోహన్, పురోహితులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. తర్వాత ఆలయాభివృద్ధిపై సమీక్షించారు. ఆయన వెంట ఆశాఖ జిల్లా అధికారి సుధాకర్ రెడ్డి ఉన్నారు.


847.70 అడుగులుగా శ్రీశైల డ్యాం నీటిమట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నీటి మట్టం బుధవారం సాయంత్రానికి 847.70 అడుగులకు చేరుకుంది. జలాశయానికి కొద్ది కాలంగా వరద నీటి ప్రవాహం నిలిచిపోయిన విషయం తెలిసిందే. మంగళవారం నుంచి బుధవారం వరకు జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 4,791 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 1,500 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,455 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 735 క్యూసెక్కులు, మల్యాల ఎత్తిపోతలకు 259 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 503 క్యూసెక్కులు విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో స్వల్పంగా 0.070 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ఉత్పత్తి చేసి 131 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 75.1420 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

చేయూతనిచ్చి.. చేదోడుగా నిలిచి

- విజయవంతంగా జగనన్న చేదోడు పథకం అమలు
- నేడు నాలుగో విడత ఎమ్మిగనూరులో ప్రారంభం
- బటన్ నొక్కి నిధులు జమ చేయనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఒక్కొక్కరికి రూ.10 వేల ప్రకారం విడుదల చేస్తున్న ప్రభుత్వం
- ఇప్పటి వరకు మూడు విడతల్లో 73,633 మందికి లబ్ధి
- 4వ విడతలో ఉమ్మడి జిల్లాలో 27,849 మంది ఖాతాల్లోకి జమకానున్న రూ.27.84 కోట్లు
- ఆనందంలో రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లు

ఏళ్ల తరబడి ఆదరణకు నోచుకోని చేతివృత్తిదారుల జీవితాల్లో రాష్ట్ర ప్రభుత్వం వెలుగులు నింపుతోంది. జగనన్న చేదోడు పథకం కింద రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. వృత్తి పరంగా వారు ఆర్థికంగా ఎదిగేందుకు ఈ నగదు ఎంతో ఉపయోగపడుతోంది. మూడు విడతలుగా నిర్విరామంగా కొనసాగిన ఈ పథకం నాలుగో విడత ఎమ్మిగనూరులో గురువారం ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) సిస్టమ్ ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నగదును జమ చేయనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.





సీఎం సభ కోసం ఎమ్మిగనూరు పట్టణంలోని వైడబ్ల్యూసీఎస్ మైదానంలో వేసిన టెంట్, కుర్చీలు

కర్నూలు(అర్బన్): ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న చేదోడు పథకాన్ని పక్కాగా అమలు చేస్తోంది. చేతి వృత్తిపై ఆధారపడి జీవనం చేస్తున్న రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలరింగ్‌ను వృత్తిగా చేసుకొని జీవనం చేస్తున్న పేద, మధ్య తరగతి వర్గాలకు ఈ పథకం ఆర్థికంగా అండగా నిలుస్తోంది. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన సమయంలో రెండు సంవత్సరాలు కరోనాతో వివిధ ప్రాంతాల్లో కర్ఫ్యూ, లాక్‌డౌన్‌తో జనజీవనం స్తంభించి పోయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంలో కూడా ప్రభుత్వం ఎలాంటి వెనకడుగు వేయకుండా చేతివృత్తిదారులకు ఆర్థికంగా అండగా నిలిచింది. 2020 జూన్ 10వ తేదీన జగనన్న చేదోడు పథకాన్ని ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 73,633 మంది లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.73,63,30,000 జమ చేసింది. తాజాగా నాలుగో విడతలో కర్నూలు జిల్లాలో 13,545 మందికి రూ.13,54,50,000, నంద్యాల జిల్లాలో 14,304 మందికి రూ.14,30,40,000 జమ చేయనుంది. రెండు జిల్లాలు కలిపి నాల్గవ విడతలో 27,849 మంది లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు రూ.27,84,90,000 జమ కానుంది.

అభివృద్ధి దిశగా..

రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.10 వేల ప్రకారం అందిస్తుండటంతో రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లు చేతి వృత్తులను అభివృద్ధి చేసుకుంటున్నారు. రజకులు వారి కుల వృత్తికి అవసరమైన డ్రమ్ములు, ఇస్త్రీ పెట్టెలు, బొగ్గులు తదితర సామగ్రి కొనుగోలుకు ఈ నగదును ఉపయోగించుకుంటున్నారు. టైలర్లు, నాయీ బ్రాహ్మణులు వారికి అవసరమైన మెటీరియల్‌ను కొనుగోలు చేసి షాపులను అభివృద్ధి పరచుకుంటున్నారు.

కష్టాలు తొలగిస్తూ..

గతంలో చేతి వృత్తిదారుల శ్రమకు తగిన ఫలితం ఉండేది కాదు. టీడీపీ హయాంలో ఇస్త్రీ పెట్టెలు, కత్తెర్లు లాంటివి ఏ కొద్దిమందికో ఇచ్చే వారు. అవి కూడా నాసిరకానికి చెందినవి, ఎలాంటి ఉపయోగం లేనివి. వీటిలోనూ టీడీపీ నాయకులు కమీషన్లు కొట్టేసేవారు. రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్లు తమ కష్టాలను ప్రజాసంకల్ప పాదయాత్రలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వీరి కోసం జగనన్న చేదోడు పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు.

నాలుగో విడతలో ఎవరికి ఎంతెంత..

లబ్ధిదారులు	కర్నూలు జిల్లా		లబ్ధిదారులు	నంద్యాల జిల్లా
7,370	రూ.7,37,00,000	టైలర్లు	5,276	రూ.5,27,60,000
3,755	రూ.3,75,50,000	రజకులు	7,158	రూ.7,15,80,000
2,420	రూ.2,42,00,000	నాయీ బ్రాహ్మణులు	1,870	రూ.1,87,00,000

నాలుగేళ్లుగా చేదోడు వివరాలు...

విడత	లబ్ధిదారులు	విడుదలైన మొత్తం
కర్నూలు జిల్లా...		
01	12,191	రూ.12,19,10,000
02	11,222	రూ.11,22,20,000
03	12,856	రూ.12,85,60,000
04	13,545	రూ.13,54,50,000
నంద్యాల జిల్లా ...		
01	12,349	రూ.12,34,90,000
02	11,479	రూ.11,47,90,000
03	13,536	రూ.13,53,60,000
04	14,304	రూ.14,30,40,000

భద్రతా ఏర్పాట్ల పరిశీలన


ఎమ్మిగనూరుటౌన్: స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో భద్రతను అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఎమ్మెల్సీ తలశిల రఘురాం, జిల్లా కలెక్టర్ సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌తో సభ నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. హెలీపాడ్ వద్ద డబుల్ బ్యారికేడింగ్, రోడ్‌షోలో చేపట్టాల్సిన బందోబస్తు చర్యలపై ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి పోలీసు అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. సభా వేదిక, బహిరంగ సభ ప్రాంగణంలో కలియతిరిగి భద్రతా ఏర్పాట్లపై ఆరా తీశారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



సీఎం భద్రతా ఏర్పాట్లపై పోలీసులకు సూచనలు ఇస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

నేడు ఎమ్మిగనూరుకు సీఎం వైఎస్ జగన్

- ఏర్పాట్లను పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- 1,500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు



కర్నూలు(సెంట్రల్): జగనన్న చేదోడు పథకం కింద నాలుగో విడత లబ్ధిదారులకు నిధులు విడుదల చేసే కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఎమ్మిగనూరుకు రానున్నారు. సీఎం పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు నుంచి ఓర్వకల్లు ఎయిర్ పోర్టు చేరుకొని అక్కడి నుంచి హెలికాప్టర్‌లో ఎమ్మిగనూరుకు వస్తారు. ఇందుకోసం ఎమ్మిగనూరులో ప్రత్యేక హెలిపాడ్‌ను ఏర్పాటు చేశారు. వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నాలుగో విడత జగనన్న చేదోడు పథకాన్ని ప్రారంభిస్తారు. లబ్ధిదారులైన రజకులు, దర్జీలు, నాయీబ్రాహ్మణులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున ఆన్‌లైన్ ద్వారా బటన్ నొక్కి జమ చేస్తారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరు పర్యటన కోసం పోలీసు శాఖ పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసింది. 1,500 మంది పోలీసులతో పూర్తి స్థాయిలో సెక్యూరిటీని కల్పించేందుకు చర్యలు తీసుకుంది. పోలీస్ బందోబస్తుపై కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్ సమీక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెలిపాడ్ నుంచి సభా వేదిక వరకు ప్రత్యేక బస్సులో ప్రజలకు అభివాదం చేసుకుంటూ వెళ్తారు.

ఏర్పాట్లన్నీ పూర్తి

సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లన్నీ బుధవారం సాయంత్రానికే పూర్తి అయ్యాయి.

- ➡ ఆదోని బైపాసు రూట్‌లో హెలిపాడ్‌ను ఏర్పాటు చేశారు.
- ➡ వీవర్స్ కాలనీలో వైఎంసీ డబ్ల్యూ గ్రౌండ్‌లో సభా వేదికను నిర్మించారు.
- ➡ సభావేదికలో బారికేడ్లను ఏర్పాటు చేసి లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశారు. వేదికపై ప్రొటోకాల్ ప్రకారం ఏర్పాట్లన్నీ పూర్తి కాగా, సభా ప్రాంగణంలో ఉన్న కంపార్టుమెంట్లలో వీఐపీలు, పాత్రికేయులకు కేటాయించేలా చర్యలు తీసుకున్నారు.
- ➡ మిగిలిన కంపార్టుమెంట్లను జగనన్నచేదోడు లబ్ధిదారులకు కేటాయిస్తారు. సభా ప్రాంగణానికి వచ్చే వారికి ఎండ తీవ్ర దృష్ట్యా తాగు నీరు, భోజనాలు, స్నాక్స్‌ను సక్రమంగా అందించేందుకు ఏర్పాట్లు చేశారు.
- ➡ నిరంతరం విద్యుత్‌ను సరఫరా చేసేలా ఆ శాఖకు ఆదేశాలు ఇచ్చారు.
- ➡ సీఎం పర్యటించే ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టేలా డీపీఓకు బాధ్యతలు అప్పగించారు.
- ➡ వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లను సిద్ధం చేశారు.
- ➡ అగ్ని మాపక శాఖ ఆధ్వర్యంలో ఫైరింజన్లను సభా వేదిక, హెలిప్యాడ్‌లలో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.



సీఎం పర్యటన ఏర్పాట్లపై ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డితో చర్చిస్తున్న సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, జిల్లా కలెక్టర్ సృజన , జేసీ మౌర్య తదితరులు

సద్వినియోగం చేసుకోవాలి



జగనన్న చేదోడు పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని వృత్తులను మెరుగుపరచుకోవాలి. ఈ పథకం కింద నాలుగో విడత గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల ఖాతాల్లో నగదును జమ చేయనున్నారు. ప్రభుత్వం అందిస్తున్న రూ.10 వేలతో ఆదాయ వనరులను పెంచుకోవాలి. ఈ మొత్తం పెట్టుబడి అవసరాలు తీర్చేందుకు ఉపయోగించుకుని ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలి.

– పీ వెంకటలక్షుమ్మ, ఈడీ, బీసీ కార్పొరేషన్

ప్రభుత్వం మేలు చేస్తోంది



కుల వృత్తిపై ఆధారపడి జీవనం చేస్తున్న నాయీ బ్రాహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో మేలు చేస్తోంది. జగనన్న చేదోడు పథకం ద్వారా అందిస్తున్న రూ.10 వేలతో షేవింగ్ సెలూన్‌కు అవసరమైన మెటీరియల్‌ను కొనుగోలు చేసి స్టాక్ ఉంచుకుంటున్నాం. గతంలో ఏ ప్రభుత్వం కూడా నాయీ బ్రాహ్మణులను ఆర్థికంగా ఆదుకోవాలని ఆలోచించలేదు. ఈ పథకం వల్ల నాయీ బ్రాహ్మణులకు ఎంతో మేలు చేకూరుతోంది.

– మంగలి నాగేశ్వరుడు

జీవనం మెరుగుపడింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేదోడు పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేలు అందిస్తున్నారు. దీంతో టైలరింగ్‌కు అవసరమైన లైనింగ్, ఫాల్స్ తదితర మెటీరియల్ తెచ్చుకుంటున్నాను. సొంతంగా మెటీరియల్ ఉన్నందున కొంత డబ్బు ఆదా అవుతోంది. టైలర్లను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం. ప్రస్తుతం 4వ విడత ఆర్థిక సహాయం కూడా అందుతున్నందున చాలా సంతోషంగా ఉంది.

– షేక్ షాలీమియ్య

అప్పు తిప్పలు తొలగాయి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏడాదికి రూ.10 వేలు ఇవ్వడం మాలాంటి పేదోళ్లకు చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం ఇస్తున్న డబ్బులతో కొత్త ఇస్త్రీ పెట్టె, బొగ్గులు, డ్రమ్ములు కొనుగోలు చేసుకుంటాం. ఈ సామగ్రి కొనుక్కునేందుకు దాదాపు రూ.10 వేల నుంచి రూ.12 వరకు ఖర్చు అవుతుంది. ఈ డబ్బులను ప్రభుత్వం ఇవ్వడం వల్ల అప్పు చేసే తిప్పలు తొలగాయి. రజకులను ఆదుకుంటున్న జగనన్నకు రుణ పడి ఉంటాం.

– బాపనపల్లె నరసమ్మ

‘కొౌథారి’ సమస్యకు పరిష్కారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, చిత్రంలో జేఏసీ నాయకులు

- సంతోషాన్ని వ్యక్తం చేసిన కార్మికులు
- వివరాలు వెల్లడించిన ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోనిటౌన్: చాలా ఏళ్ల తర్వాత కొథారి మిల్లు కార్మికులకు ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి చొరవతో పరిష్కారం దొరికింది. పెండింగ్‌లో ఉన్న 37 శాతం గ్రాట్యుటీ చెల్లించేందుకు అడ్డంకులు తొలగిపోయాయి. ఆదోని పట్టణంలోని కొథారి మిల్లు 20 ఏళ్ల క్రితం లాక్ అవుట్ అయ్యింది. మిల్లు మూతపడటంతో ఉపాధిని కోల్పోయి, ఆర్థిక ప్రయోజనాలు చేతికందక అనారోగ్యంతో 270 మంది కార్మికులు మృతి చెందారు. మిగిలిన కార్మికుల ప్రయోజనాల కోసం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తూ వచ్చారు. మిల్లు యజమాని గట్టు నాగభూషణం గతంలో కార్మికులకు 67 శాతం గ్రాట్యుటీ చెల్లించారు. మిగిలిన 37 శాతం కోసం కార్మికులు ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో సమస్యను జేఏసీ నాయకులు ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కార్మిక నాయకుల విన్నపం మేరకు ఎమ్మెల్యే స్పందించారు. హైదరాబాద్‌కు చెందిన రాఘవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డితో చర్చించడంతో కొథారి మిల్లుకు సంబంధించిన 33 ఎకరాలను కొనుగోలు చేశారు. మొత్తం 770 మంది కార్మికులకు చెల్లించాల్సిన రూ.9 కోట్ల గ్రాట్యుటీని చెల్లించేందుకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, న్యాయవాది జీవన్ ఆధ్వర్యంలో వారు అంగీకరించారు. ఈ విషయాన్ని బుధవారం ఆదోని పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. మిల్లుకు సంబంధించిన భూములను హైదరాబాద్‌కు చెందిన రాఘవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి కొనుగోలు చేశారని, మిల్లు కరెంట్ బిల్లు, ఇతరత్రా బకాయిలు చెల్లించేందుకు అంగీకరించారన్నారు. లేబర్ కోర్టులో సమస్యను పరిష్కరించే బాధ్యత న్యాయవాదిపైనే ఉందన్నారు. విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు అజయ్‌బాబు, నేతప్ప, షాదిక్‌వలీ, నాగరాజు, ఈరన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, తిమ్మప్ప పాల్గొన్నారు.

కైలాస వాహనంపై దివ్యతేజం

- శ్రీశైలంలో స్వామిఅమ్మవార్లకు కైలాసవాహన సేవ
- కూష్మాండదుర్గ అలంకారంలో భక్తులకు సాక్షాత్కరించిన భ్రామరి
- కన్నుల పండువగా గ్రామోత్సవం



నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: దసరా మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి కైలాస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామిఅమ్మవార్లను అలంకార మండపంలో కైలాస వాహనంపై అధిష్టింపజేశారు. అర్చకులు, పండితులు ప్రత్యేక పూజాదికాలను నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఉత్సవం నిర్వహించి ఉత్సవమూర్తులను గ్రామోత్సవానికి తరలించారు. ఆలయ రాజగోపురం గుండా గంగాధర మండపం, నందిమండపం, బయలువీరభద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవాన్ని కన్నుల పండువగా సాగింది. వేడుకలో కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేక అలంకృతులైన స్వామిఅమ్మవార్లను భక్తులు కన్నులారా దర్శించుకుని ప్రత్యేక నీరాజనాలు సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు, ఏఈవో మోహన్, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రదక్షిణ



డోలు కళాకారుల విన్యాసం

ఆది స్వరూపిణి..కూష్మాండదుర్గ

సృష్టి లేని వేళ..దశ దిశలు అంధకారంలో ఉన్నప్పుడు.. తన మందస్మితంతో ఈ బ్రహ్మాండాన్ని సృష్టించిన దివ్యస్వరూపిణి కూష్మాండదుర్గ. ఈ దేవి సృష్టికి ఆది స్వరూపిణిగా పండితులు చెబుతారు. కూష్మాండదుర్గ దేవిని ఆరాధించడం వల్ల రోగాలన్నీ తొలగి ఆరోగ్యం చేకూరుతుందని, ఆయువు, యశస్సు వృద్ధి చెందుతాయని భక్తుల నమ్మకం. కూష్మాండదుర్గ అలంకారంలో అమ్మవారిని ఆలయ ముందు ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికలో అధిష్టింపజేసి ఆలయ అర్చకులు, పండితులు ప్రత్యేక పూజాదికాలను నిర్వహించారు.

శ్రీశైలంలో నేడు..

దసరా మహోత్సవాల్లో భాగంగా శ్రీశైలంలో గురువారం ఐదో రోజు శ్రీశైల భ్రమరాంబాదేవి స్కంధమాత అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామిఅమ్మవార్లు శేషవాహనంపై విహరించనున్నారు.

యువకుడి బలవన్మరణం

ఆదోని సెంట్రల్: మతిస్థిమితం లేని ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్ఐ ఎం. రామస్వామి తెలిపిన వివరాల మేరకు..ఆదోని మండలం గణేకల్లు గ్రామానికి చెందిన బి.సోమలింగప్ప కుమారుడు బడే సందీప్ ఇంటర్ వరకు చదువుకున్నాడు. చదువు మీద ఎక్కువగా దృష్టి సారించడంతో మతిస్థిమితం కోల్పోయాడు. పలు చోట్ల తిరుగుతూ బుధవారం ఆదోని–ఇస్వీ రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

రెండు ఇనుప ఖనిజ లారీలు సీజ్

కర్నూలు (న్యూసిటీ) : అక్రమంగా ఇనుప ఖనిజాన్ని తరలిస్తున్న రెండు లారీలను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు. ఓర్వకల్లు నుంచి కర్నూలు వైపు వస్తుండగా మంగళవారం అర్ధరాత్రి నన్నూరు టోల్‌ప్లాజా వద్ద తనిఖీ చేసి పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. అనుమతి లేకుండా ఇనుప ఖనిజాన్ని తరలిస్తుండటంతో రూ. 75 వేలు జరిమానా విధించినట్లు ఆయన వెల్లడించారు.

రేపు జోగులాంబకు కలెక్టర్ పట్టు వస్త్రాల సమర్పణ

కర్నూలు(సెంట్రల్): అలంపూర్ జోగులాంబ అమ్మవారికి శుక్రవారం(20వ తేదీ) పట్టు వస్త్రాలు సమర్పించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన నిర్ణయించారు. కర్నూలు జిల్లా కలెక్టర్ తరఫున ప్రతియేటా నవరాత్రుల్లో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించే సంప్రదాయం కొనసాగుతూ వస్తోంది. అందులో భాగంగా ఈ శుక్రవారం ఉదయం ఆమె అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ మేరకు జోగులాంబ ఆలయాధికారులకు జిల్లా అధికారులు సమాచారం పంపారు.

తీవ్ర అస్వస్థతతో చిన్నారి మృతి

హొళగుంద: మండల కేంద్రం హొళగుంద పెద్దమ్మవ్వ కాలనీకి చెందిన బోయ దేవరాజ్, పద్మావతి కుమార్తె త్రివేణి(4) మంగళవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందారు. మూడు రోజుల నుంచి తీవ్ర జ్వరంతో బాధపడుతున్న చిన్నారికి స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించగా తగ్గింది. మంగళవారం ఉన్నట్టుండి తీవ్ర అస్వస్థతకు గురవడంతో వెంటనే కుటుంబ సభ్యులు బళ్లారి ఓపీడీలో చేర్పించగా కోలుకోలేక మృతి చెందింది. అల్లారు ముద్దుగా చూసుకునే బిడ్డ మృతితో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. కాగా గ్రామంలో డెంగీ, టైఫాయిడ్ వ్యాధులు ప్రబలినట్లు స్థానికులు తెలిపారు.

కోసిగిలో రెండిళ్లల్లో చోరీ

కోసిగి: మండల కేంద్రమైన కోసిగిలో మంగళవారం రాత్రిలో రెండు ఇళ్లల్లో చోరీ జరిగింది. కర్నూలు నుంచి వచ్చిన క్లూస్ టీమ్ బృందం దొంగతనాలు జరిగిన ఇళ్లలో వేలిముద్రలు సేకరించింది. కోసిగి పాత పోస్టాఫీసు వెళ్లే రోడ్డులోని ఓ ఇంట్లో రెండవ అంతస్తులో గట్టు కాశీనాథ్ ఇంట్లో రూ.15వేలు నగదు, 13 గ్రాములు బంగారం చైన్‌ను అపహరించారు. అలాగే కోసిగయ్య దేవాలయం సమీపంలోని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తోవి రామకృష్ణ ఇంట్లో 10తులాల వెండి పట్టుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కోసిగి పోలీసులు కేసు నమోదు చేశారు.

జగనన్న కాలనీలు ఇక పవర్ ఫుల్

- రూ. 30.64 కోట్లతో ఎలక్ట్రిఫికేషన్ పనులు
- 1,150 ట్రాన్స్‌ఫార్మర్లు, 14,830 స్తంభాల ఏర్పాటు
- త్వరలో పెండింగ్ పనులు పూర్తికి చర్యలు
- 1,56,642 కుటుంబాలకు చేకూరనున్న లబ్ధి



తుగ్గలి మండలం రాతన గ్రామంలో జగనన్న కాలనీలో పూర్తయిన విద్యుత్ లైన్ పనులు

కర్నూలు(రాజ్‌విహార్): పేదల సొంతింటి కలను నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న వైఎస్సార్ జగనన్న కాలనీలకు మరింత వెలుగులు తెచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్న 973 లేఅవుట్లలో విద్యుదీకరణ పనులు ముమ్మరంగా సాగుతుఅన్నాయి. రూ.30.64కోట్లతో ఎలక్ట్రిఫికేషన్ చేపట్టగా ఇప్పటికే 1,150 ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు 14,830 స్తంభాలు ఏర్పాటు చేశారు. మిగిలిన పనులు వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు విద్యుత్ శాఖ ముమ్మరం చేసింది.

1,56,642 కుటుంబాలకు లబ్ధి

జగనన్న కాలనీల్లో వందల సంఖ్యలో ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇవి కొత్త ఊర్లుగా వెలుస్తున్నా యి. కేవలం ఇళ్ల నిర్మాణమే కాకుండా ఈ కాలనీల్లో ఇతర సదుపాయాలూ కూడా రాష్ట్ర ప్రభు త్వం కల్పిస్తోంది. ఇందులో ముఖ్యమైన విద్యుత్‌పై ప్రత్యేక దృష్టిసారించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేస్తున్న 973 కాలనీల్లో 1,56,642 కుటుంబాలకు మేలు చేకూరుతోంది.

రూ. 30.64 కోట్లతో పనులు

జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.30.64కోట్లు ఖర్చు చేస్తోంది. వీటితో ఆయా లే అవుట్లతో కావాల్సిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభా లు, లెస్ట్ ఆఫ్ లైన్ విద్యుత్ వైరు, ఏబీ స్విచ్‌లు, కాసారాలు, ఇతర సామాగ్రి ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల వేసిన బోర్లకు రూ.12.25 కోట్లతో విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. ఆయా కాలనీల్లో విద్యుదీకరణ పనులు చేపట్టాలని గృహ నిర్మాణ సంస్థ అధికారులు విన్నవించడంతో రూ.30.64 కోట్లతో ప్రతిపా దనలు సిద్ధం చేసి, ప్రభుత్వానికి పంపించారు. ఈ నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించిన దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఉమ్మడి జిల్లాల్లో 85 శాతం పూర్తి చేసింది. మిగిలిన 15 పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ పనులు పూర్తయితే, ఆయా కాలనీల్లో వెలుగుల శోభ నెలకొననుంది.

నాణ్యతతో పనులు పూర్తి



కర్నూలు, నంద్యాల జిల్లాల్లో నిర్మిస్తున్న 973 జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ పనుల కోసం చర్యలు చేపట్టాం. దీనికి సంబంధించి రూ.30.64 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపగా కావాల్సిన నిధులు మంజూరు చేసింది. దీంతో వెంటనే పనులు ప్రారంభించి నాణ్యతతో చేపట్టాం. వీటిని కావాల్సిన ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, ఇతర సామాగ్రి అంతా సిద్ధంగా ఉంది. పనుల నాణ్యతలో రాజీ లేదు. మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం.

– ఎం. ఉమాపతి, ఎస్ఈ, కర్నూలు ఆపరేషన్స్, విద్యుత్ శాఖ

ఉమ్మడి జిల్లాల్లోని డివిజన్లలో పూర్తి చేసిన పనుల వివరాలు

డివిజన్ పేరు	లేఅవుట్ల సంఖ్య	వాటిలోని ప్లాట్ల సంఖ్య	ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు	స్తంభాలు	విద్యుత్ లైను(కి.మీ.)	అంచనా వ్యయం
ఆదోని	354	41,183	510	6,100	351	రూ.10.58కోట్లు
కర్నూలు టౌన్	54	16,885	55	1,510	120.5	రూ.2.15కోట్లు
కర్నూలు రూరల్స్	155	45,079	215	1,510	80.56	రూ.6.25లక్షలు
డోన్	119	16,967	130	1,520	137	రూ.3.65కోట్లు
నంద్యాల	291	36,528	240	2,500	175.6	రూ.8.01కోట్లు
మొత్తం	973	1,56,642	394	14,830	864.66	రూ.30.65కోట్లు

వ్యాఘ్రవాహనంపై కూష్మాండదుర్గ



మహానందిలో వ్యాఘ్రవాహనంపై అమ్మవారికి గ్రామోత్సవం

మహానంది: దసరా నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారు బుధవారం రాత్రి శ్రీ కూష్మాండదుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు అమ్మవారికి విశేష ద్రవ్యాభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం వ్యాఘ్రవాహనంపై కొలువైన అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు.

నందవరంలో..



కూష్మాండ అలంకారంలో శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారు

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారు దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం కూష్మాండ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ రామానుజన్ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆవాహిత పూజ చేశారు.

కాంచీపురం గౌరీ సిల్క్స్ షోరూం ప్రారంభం



జ్యోతి ప్రజ్వలనతో గౌరీ సిల్క్స్ షోరూంను ప్రారంభిస్తున్న సినీతార అనసూయ

కర్నూలు(టౌన్): స్థానిక గాంధీనగర్ మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన కాంచీపురం గౌరీ సిల్క్స్ షోరూంను బుధవారం సినీనటి అనసూయ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పట్టు వస్త్రాలకు కాంచీపురం ప్రసిద్ధి అని, అక్కడ తయారైన చీరెలు కర్నూలువాసులకు అందుబాటులో ఉంచడం సంతోషించదగ్గ విషయమన్నారు. గతంలో హైదరాబాద్‌కు వెళ్లి పట్టు కలెక్షన్లు కొనుగోలు చేసే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఇక్కడే అన్ని లభిస్తున్నాయన్నారు. గౌరీ సిల్క్స్ షోరూం అధినేత కార్తీక్ మాట్లాడుతూ షోరూం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని డిస్కౌంట్ ఇస్తున్నామని, వినియోగదారులు వినియోగించుకోవాలన్నారు.

ఎల్లార్తిలో కేరళ పోలీసులు

- మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం రాక

హొళగుంద: ఎల్లార్తి గ్రామానికి బుధవారం కేరళ పోలీసులు వచ్చారు. కొద్ది నెలల క్రితం గ్రామానికి చెందిన గజేంద్ర అనే వ్యక్తి అయ్యప్ప దీక్ష ధరించి శబరిమలైకు బయలుదేరారు. యాత్రలో ఉండగానే రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కేరళలోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తోటి మాలధారులు ఆయన భార్యకు సమాచారం ఇచ్చారు. అక్కడి నుంచి గజేంద్రను ఇక్కడికి తీసుకొచ్చి చికిత్స చేయించినా ఫలితంలేక కోలుకోలేక మృతి చెందాడు. అయితే గజేంద్ర మృతిపై అనుమానం ఉందని ఆయన భార్య కేరళలో కేసు పెట్టడంతో అక్కడి పోలీసులు బుధవారం ఎల్లార్తికి వచ్చారు. గజేంద్ర మృతదేహానికి పోస్ట్‌మార్టం చేసేందుకు మరో వైద్యుడు రావాల్సి ఉండడంతో గురువారానికి వాయిదా వేసినట్లు హొళగుంద ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఎల్లార్తిలో కార్డెన్ సెర్చ్

- రింగు కర్రలు స్వాధీనం

హొళగుంద: ఈ నెల 24న దేవరగట్టులో దసరా బన్ని ఉత్సవం నేపథ్యంలో సెబ్ సీఐ ఎర్రన్న వెంకట్ హొళగుంద, హాలహర్వి ఎస్ఐలు శ్రీనివాసులు, నాగేంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది ఎల్లార్తి గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇళ్లల్లో సోదాలు చేసి రింగు కర్రలు, ఇతర ఆయుధలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసు అధికారులు మాట్లాడుతూ బన్ని ఉత్సవాలకు భక్తులు రింగు కట్టలు తీసుకెళ్లడం, మద్యం సేవించి వెళ్లడం మంచి సంప్రదాయం కాదన్నారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో అగ్గి కాగడాలను భక్తులపై విసరినా, అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉత్సవాలు జరుపుకోవాలన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత

బొమ్మలసత్రం: అక్రమంగా నంద్యాలకు తరలిస్తున్న తెలంగాణ మద్యాన్ని సెబ్ పోలీసు అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని నూనెపల్లి వీధి ఎస్సీ కాలనీకి చెందిన సురేష్ కొంత కాలంగా ఇతర రాష్ట్రాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో తెలంగాణలోని మహబూబ్‌నగర్ ప్రాంతానికి చెందిన బోయ పరమేష్‌తో పరిచయం ఏర్పడింది. మంగళవారం అర్ధరాత్రి ఐజ మండలం రాజనగరం గ్రామంలో 120 మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి కా రులో నంద్యాలకు బయలుదేరాడు. సమాచారం అందుకున్న సెబ్ పోలీసులు నూనెపల్లిలోని సురేష్ ఇంటి వద్ద మద్యం బాటిళ్లు దించుతుండగా పట్టుకున్నారు. కారుతో పాటు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సెబ్ సీఐ లక్ష్మణ్‌రాజ్, త్రీటౌన్ సీఐ నరసింహులు తెలిపారు.

ప్రజల దరికి పాలన

- గ్రామ సచివాలయం ప్రారంభోత్సవంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన



హనుమాన్ నగర్‌లో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా పాలనన ప్రజల దరికి చేర్చారని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లుతో కలిసి మంత్రి ప్రారంభించారు. అంతకు ముందు పట్టణంలోని చెన్న కేశవ, ఆంజనేయ స్వామి ఆలయాల ఆవరణల్లో రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న వినాయక, సంతాన వేణుగోపాల స్వామి, మాధవ స్వామి ఆలయాలు, ఉత్తర ద్వారం పనులను మంత్రి పరిశీలించారు. తర్వాత కోటపేట మీదుగా పాదయాత్రగా బయలు దేరి రూ.3.70 కోట్లతో జరుగుతున్న కందకం అభివృద్ధి పనులను పరిశీలించారు. పట్టణానికి కీలకమైన ఈ పనులను వేగవంతం చేయడమే కాకుండా నాణ్యతగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చారిత్రాత్మక నేపథ్యం ఉన్న కోటపేట ముఖ ద్వారం (ఊరవాకిలి) ని అభివృద్ధి చేయాలని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబుకు సూచించారు. కందకం పక్కన్న లచ్చమ్మ ఆలయానికి స్థలం కేటాయించాలని స్థానికులు మంత్రి బుగ్గనకు విన్నవించగా సానుకూలంగా స్పందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గోరుకల్లు రిజర్వాయర్ నుంచి డిసెంబర్‌లోపు ఇంటింటికి తాగు నీరు అందజేస్తామన్నారు. ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కొలుములపల్లె రహదారిలో రూ.60 లక్షలతో నిర్మిస్తున్న మార్కెట్ యార్డు నిర్మాణ పనులను పరిశీలించి, మౌలిక సదుపాయాల కల్పనపై కాంట్రాక్టర్‌తో చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి బాబు మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు తిరుమలేశ్వర్ రెడ్డి, ఖాజా, వార్డు కౌన్సిలర్లు నాగజ్యోతి, మహేశ్వరి, చింతల నాగిరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సొంత వైద్యం మానుకో!

- ప్రాణాల మీదికి తెస్తున్న సొంత వైద్యం
- డాక్టర్ వద్దకు వెళ్తే ఖర్చవుతుందని నిర్ణయం
- నొప్పుల మాత్రల నుంచి యాంటిబయాటిక్స్ వరకు కొనుగోలు
- ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపుల్లో మందుల అమ్మకాలు
- వైద్యుల సూచన లేకుండా వాడితే దీర్ఘకాలంలో ఇబ్బందులు

కర్నూలు నగరంలోని సి.క్యాంపు ప్రాంతానికి చెందిన లీలాదేవికి రెగ్యులర్‌గా నెలసరి వచ్చేది. ఒకసారి వారింట్లో పూజ ఉండటంతో ఆ సమయానికి పీరియడ్స్ రాకుండా మెడికల్‌షాపునకు వెళ్లి మాత్రలు తెచ్చి వేసుకునేది. అయితే అవి కాస్తా సైడ్‌ఎఫెక్ట్ ఇచ్చి ఆమెకు తీవ్రంగా కడుపునొప్పి వచ్చింది. ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకుంటే గానీ సమస్య పరిష్కారం కాలేదు.

ఆదోనికి చెందిన లారీ డ్రైవర్ వీరస్వామి వివాహేతర సంబంధాలు ఏర్పరుచుకుని బయటకు వెళ్తుండేవాడు. ఈ క్రమంలో అతను మెడికల్ షాపునకు వెళ్లి పురుషాధిక్యం కోసం మాత్రలు తీసుకుని వాడేవాడు. ఒకసారి పరిమితికి మించి మాత్రలు వాడటంతో తీవ్రమైన గుండెపోటు వచ్చింది. సకాలంలో చికిత్స తీసుకుని బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న వైద్యుడు అతనికి కౌన్సెలింగ్ ఇవ్వాల్సి వచ్చింది.

వీరే కాదు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా నేరుగా మెడికల్‌షాపులకు వెళ్లి మాత్రలు తీసుకుని వేసుకునేవారి సంఖ్య ఇటీవల బాగా పెరిగింది. కొందరికి ఏమీ గాకపోయినా మరికొందరికి సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నాయి. ఇంకొందరికి దీర్ఘకాలంలో సమస్యలు వచ్చి ప్రాణాపాయంలోకి నెట్టేస్తున్నాయి. సొంత వైద్యం కొంత మానుకుని వైద్యుల వద్దకు వెళ్లి ఆరోగ్య సమస్యలకు చికిత్స చేసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,800 దాకా పైగా రిటైల్ మెడికల్‌షాపులు, 220 వరకు హోల్‌సేల్ మందుల ఏజెన్సీలు ఉన్నాయి. కోవిడ్ తర్వాత మందుల దుకాణాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన పెరగడం, కోవిడ్ అనంతరం పలు వ్యాధులు వస్తుండటంతో ప్రజలకు అటు వైద్యులు, ఇటు మందుల అవసరం అధికమైంది. ఈ క్రమంలో వైద్యుల సంఖ్యతో పాటు మెడికల్ షాపుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఫలితంగా నగరాలు, పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల్లో ఇప్పుడు మెడికల్ షాపులు దర్శనమిస్తున్నాయి. అయితే, అధిక శాతం దుకాణాల్లో వైద్యుల మందుల చీటి లేకుండానే అన్ని రకాల మందులు విక్రయిస్తున్నారు. కోవిడ్ సమయం నుంచి ఈ విపరీత ధోరణి మరింత అధికమైంది.



వైద్యుల వద్ద ఖర్చు పెరగడమే కారణం

ఏదైనా ఒంట్లో నలతగా ఉంటే గతంలో సమీపంలోని వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకునేవారు. అప్పటి వైద్యులు రోగి వ్యాధి లక్షణాలు గుర్తించి ఆ మేరకు అవసరమైన మందులు రాసేవారు. అనవసరంగా వైద్యపరీక్షలు, మందులు రాసేవారు కాదు. కానీ ఇప్పుడు జ్వరం వచ్చిందని వైద్యుల వద్దకు వెళ్లినా అధిక శాతం మంది అవసరం లేకపోయినా మందులు, వైద్యపరీక్షలు రాస్తున్నారు. జ్వరం వస్తేనే వారికి డాక్టర్ బిల్లు రూ.2వేల నుంచి రూ.2,500 దాకా అవుతోంది. ఇక దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్, థైరాయిడ్, గుండెజబ్బులు వంటి వాటికి డాక్టర్ వద్దకు వెళ్తే ఖర్చు రూ.5 వేలు దాటుతుంది. ఈ ఖర్చులు తగ్గించుకునేందుకు కొందరు, భరించలేక మరికొందరు రోగులు మెడికల్‌షాపులను ఆశ్రయిస్తున్నారు. ఒంట్లో ఏదైనా నలతగా ఉంటే తెలిసిన మెడికల్‌షాపునకు వెళ్లి మందులు తెచ్చుకుంటున్నారు. అయితే జలుబు, దగ్గు, జ్వరం, నొప్పుల వరకు అయితే ఓకే గానీ కొన్నిసార్లు యాంటిబయాటిక్స్, తీవ్రమైన స్టెరాయిడ్స్, నొప్పుల మాత్రలు కూడా రోగులకు విక్రయిస్తున్నారు. కర్నూలులోని కొన్ని దుకాణాల్లో మత్తు కలిగించే మందులు, ఇంజెక్షన్లు కూడా వాటికి బానిసైన వారికి విక్రయిస్తున్నారు. దీనికితోడు దగ్గు సిరప్‌లను అధిక శాతం విక్రయించే దుకాణాలు సైతం నగరంలో ఉన్నాయి. ఇక గ్రామీణ ప్రాంతాల్లోని మెడికల్ షాపుల్లో పరిస్థితి చెప్పనవసరం లేదు.

ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తే చర్యలు



వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించడం నేరం. ఇలా మందులు విక్రయించడం రోగుల ప్రాణాలతో ఆటలాడుకోవడమే. కొన్ని మెడికల్ షాపుల్లో వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. ఇలాంటి వాటిపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాము.

–రమాదేవి, అడిషనల్ డైరెక్టర్, ఔషధనియంత్రణ శాఖ

కడుపులో అల్సర్స్ ఏర్పడే ప్రమాదం



వైద్యుల సూచన లేకుండా నొప్పులు, స్టెరాయిడ్ మందులు వాడటం వల్ల కడుపులో పుండ్లు ఏర్పడే ప్రమాదం ఉంది. ఎక్కువశాతం కిడ్నీలు కూడా దెబ్బతింటాయి. కీళ్లనొప్పులు, ఇతర నొప్పులు తగ్గేందుకు వాడే ఈ మందులు తాత్కాలికంగా పనిచేసినా దీర్ఘకాలంలో దుష్ప్రభావాలు చూపిస్తాయి. ఇటీవల కాలంలో బరువు తగ్గేందుకు హెర్బల్ పౌడర్ వాడుతున్నారు. దీనివల్ల కాలేయం దెబ్బతినే అవకాశం ఎక్కువ.

–డాక్టర్ పి. అబ్దుల్ సమద్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, కర్నూలు

అతిగా వాడితే ప్రాణాంతకం

వైద్యుల సూచన లేకుండా ఎడా పెడా మందులు కొని వాడితే అది మొదటికే మోసం చేస్తుంది. వైద్యులు 6 నుంచి 10 సంవత్సరాల పాటు వైద్య విద్యను అభ్యసిస్తే గానీ ఏ వ్యాధికి ఎలాంటి మందులు ఇవ్వాలి, ఎంత మోతాదులో ఇవ్వాలి, వారి శరీర బరువు, వారి శరీర తత్వం, వారి శరీరం ఎప్పుడు ఎలా స్పందిస్తుంది, ఏ మందుకు ఎలా స్పందిస్తుంది లాంటి వివరాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తర్వాత మాత్రమే వారు ఫలానా మందులను సూచిస్తూ ఉంటారు. వారి ప్రమేయం లేకుండా నేరుగా మందుల దుకాణంలో కొని వాడితే కొన్నిసార్లు ప్రాణం మీదకు వచ్చే ప్రమాదం ఉంది. మరీ ముఖ్యంగా యాంటిబయాటిక్స్ వాడటం వల్ల శరీరంలోని మంచి బ్యాక్టీరియా కూడా నశిస్తుంది. ఎప్పుడు పడితే అప్పుడు ఎలా పడితే అలా వేసుకుంటే భవిష్యత్‌లో



మళ్లీ వ్యాధి వచ్చినప్పుడు అవి పనిచేయకుండా పోతాయి. అలాగే పెయిన్ కిల్లర్స్, స్టెరాయిడ్స్ వాడితే కడుపులో పుండ్లు, కాలేయ సమస్యలు, కిడ్నీ సమస్యలు వస్తాయి. పీరియడ్స్ రావడానికి, పీరియడ్స్ వాయిదా పడేందుకు వాడే మందులు సైతం వైద్యుల సూచన లేకుండా వాడకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.







• ఒకనాటి దసరా

లేదయా మీ దయా మా మీద లేదు

దసరా అంటే సెలవులు.
దసరా అంటే అయ్యవార్లతో పిల్లలు కలిసి వెళ్లి పాడే పాటలు.
దసరా అంటే పగటి వేషాలు. దసరా అంటే బతుకమ్మలు.
దసరా అంటే బొమ్మల కొలువులు.
దసరా అంటే ఊళ్ల నుంచి విచ్చేసే బంధువులు.
జేబు నుంచి తీసి ఇవ్వాల్సిన ఆత్మీయ మామూళ్లు.
దసరా అంటే స్త్రీ, పురుషులకు ఉల్లాసం.
పిల్లలకు ఆటవిడుపు. కాలం చాలా మారింది. నాటి దసరా ఎలా ఉంటుందో
నేటి తరాలకు పదే పదే చెప్పాల్సిన అవసరం ఏర్పడింది.
పెద్దలకు గుర్తు చేయాల్సిన బాధ్యత కూడా.

'ఏ దయా మీ దయా మా మీద లేదు ఇంత నిర్లక్ష్యమా ఇది మీకు తగదు
పావలా అర్ధయితే పట్టేది లేదు ముప్పావలా అయితే ముట్టేది లేదు
హెచ్చు రూపాయయితే పుచ్చుకుంటాము
అయ్యవారికి చాలు ఐదు వరహాలు పిల్లవారికి చాలు పప్పు బెల్లాలు'...

ఒకప్పుడు దసరా వస్తే పిల్ల దండును వెంట బెట్టుకుని అయ్యవార్లు బయలుదేరేవారు. ఇంటింటికి తిరిగేవారు. మామూళ్లు స్వీకరించేవారు. ఆ రోజుల్లో ఊళ్లలో బడి కొత్త. చదువు కొత్త. అయ్యవార్లకు జీతాలు అంతంత మాత్రం. సంవత్సరంలో నేర్పిన విద్య దసరా సెలవుల్లో పెద్దల ముందు అయ్యవార్లు పిల్లల చేత ప్రదర్శింపచేసేవారు. పిల్లల తెలివితేటలు చూసి పెద్దలు ముచ్చట పడేవారు. బడికి చందాలు, అయ్యవార్లకు మామూళ్లు ఇచ్చేవారు. ఆ సమయంలో ఇలా పైన రాసిన పాట పాడేవారు. ఇంతకీ వరహా అంటే మూడున్నర రూపాయి.

దసరా కోసం పిల్లలు ఎదురు చూసేవారు. ఆ సమయంలో పిల్లల్ని బంధువుల వద్దకు పంపుతామనే హామీ ఉండేది. అవ్వా, తాతల దగ్గరికో, బాబాయి దగ్గరికో, మేనత్త ఊరికో నాలుగు జతలు పెట్టుకుని పిల్లలు ఉత్సాహంగా వెళ్లేవారు. దసరా సెలవులు హాయిగా గడిపేవారు.

దసరా వేషాలు

దసరాలో పిల్లలకు, పెద్దలకు ఆసక్తి దసరా వేషాలు. చాలా మంది కళాకారులు పురాణ వేషాలు కట్టి ఇళ్ల ముందుకు వచ్చి కానుకలు స్వీకరించేవారు. పిల్లలకు ఈ వేషాలు చూడటం మహా సరదా. సీతారాములు, హనుమంతుడు, నారదుడు, శివుడు, అర్ధ నారీశ్వరుడు... ఇక పులి వేషాలు తప్పనిసరి. ఆ రోజుల్లో పులిని చూడటం అరుదు కాబట్టి (సినిమాల్లో తప్ప) మనిషే పులి రూపు కట్టి ఎదురు పడితే అబ్బురపడేవారు. తప్పెట్ల మోతకు వేషగాళ్లు లయబద్ధంగా ఆడుతుంటే నోరు తెరిచి చూసేవారు. నేలన పడేసిన రూపాయి కాసునో నిమ్మకాయనో పులి వేషగాడు నోట కరవడం ఒక ఘట్టం. దసరా నవరాత్రులు వైభవంగా జరుగుతాయి కదా. అలా ఎవరైనా ఎప్పుడూ కళకళలాడుతూ ఉంటే 'దసరా బుల్లోడు' అనడం ఆనవాయితీ.

బొమ్మల కొలువులు

ఇక బొమ్మల కొలువు పెట్టి ఆనందించడం ఆడపిల్లల వంతు. బొమ్మల కొలువును ఎప్పుడూ బేసి సంఖ్య మెట్ల మీద ఏర్పాటు చేస్తారు. ఇంటి ఆచారాన్ని బట్టి ఇంటి ఆడపిల్ల చేత పార్వతీ పరమేశ్వరులను గాని, సీతారాములను గాని, రాధాకృష్ణులను గాని, లక్ష్మీ సరస్వతులను గాని పెట్టిస్తారు, అమ్మాయి మొదటి దేవతా మూర్తిని పెట్టాక, ఆ యేడు కొన్న కొత్త బొమ్మను తల్లి కూడా పట్టుకుని పెట్టిస్తుంది. ప్రతి ఏడు ఒక కొత్త బొమ్మ తప్పనిసరిగా కొనడం ఆచారం. ఈ క్రమం లోనే, కొండపల్లి బొమ్మలు, నక్కపల్లి బొమ్మలతో పాటు దేశదేశాల బొమ్మలు సేకరించి బొమ్మల కొలువులో పెట్టడం వ్యాప్తి లోకి వచ్చింది. అందంగా, కళాత్మకంగా అమర్చిన బొమ్మల కొలువు పేరంటానికి బంధు మిత్రులను పిలిచి తొమ్మిది రోజులూ పేరంటం చేస్తారు. పేరంటానికి పిల్లలూ పెద్దలూ కూడా వస్తారు. బొమ్మలకు హారతి ఇచ్చి ప్రసాదం పంచిపెడతారు.

బతుకమ్మ

తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమయిన పండగ బతుకమ్మ. బతుకమ్మ పండగ వస్తూందంటే తెలంగాణా పల్లెల్లో నూతన ఉత్సాహం వెల్లివిరుస్తుంది. అది ఒక పెద్ద సంబరంగా భావిస్తారు. ఇళ్ళు శుభ్రపరుస్తారు. చక్కగా అలంకరించు కుంటారు. ఆడపిల్లల్ని పుట్టింటికి తీసుకు వస్తారు. అత్తగారింట్లో వుండే ప్రతి ఆడపిల్లా పుట్టింటికి వెళ్లడం కోసం ఎదురు చూస్తుంటుంది. రంగు రంగుల పూలతో త్రికోణాకారంలో పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడతారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలిపువ్వు బతుకమ్మ, సద్దుల బతుకమ్మ.. ఇలా దేని ప్రత్యేకత దానిదే.. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ బతుకమ్మలను నీటి ప్రవాహంలో నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి, భయం, చరిత్ర, పురాణాలు మేళవిస్తారు. ఈ పాటలు చాలా వినసొంపుగా ఉంటాయి.



పటాలు, విగ్రహాలు





సంతృప్తికరమైన సేవ

ఆలయంలో అయినా, ఇంట్లో అయినా పూజను ఎంతో భక్తి శ్రద్ధలతో నిష్ఠగా చేస్తాం. ఇంట్లో ఉండే దేవతా మూర్తుల విగ్రహాలు, పటాలు, ఫొటో ఫ్రేములు జారిపడినా, పక్కకు ఒరిగిపోయినా అపశకునంగా భావిస్తారు. అందుకే మరింత శ్రద్ధగా పూజ చేయడంతోపాటు, పూజాసామగ్రిని ఎంతో జాగ్రత్తగా భద్రపరుస్తుంటారు. అయినప్పటికీ కొన్నిసార్లు విగ్రహాలు పాతబడి విరిగి పోవడం, ఫొటో ఫ్రేములు చిరిగిపోవడం లేదా తుప్పు పట్టి పాడైపోవడం జరుగుతుంటుంది. అలాంటి వాటిని వెంటనే తీసేసి కొత్తవాటిని పూజలో పెట్టుకుంటారు. మనలో చాలామంది ఇలానే పడేస్తుంటాము. తృప్తి గైక్వాడ్ మాత్రం ఈ విగ్రహాలను పడేయకుండా.. రీ సైకిల్ చేసి రకరకాల వస్తువులను తయారు చేస్తోంది. చెత్తగా మారకుండా... సరికొత్త హంగులు అద్ది అందంగా మారుస్తోంది.



మహారాష్ట్రలోని యోవలాలో పుట్టి పెరిగిన తృప్తి గైక్వాడ్ వృత్తిపరంగా నాసిక్‌లో స్థిరపడింది. న్యాయవాదిగా క్షణం తీరికలేని పని తనది. అయితే తన చుట్టూ ఉన్న సమాజంలో జరిగే విషయాలను ఎంతో ఆసక్తిగా గమనించే మనస్తత్వం కావడం వల్ల 2019లో ఓసారామె గంగానదిని చూడడానికి వెళ్లింది. అప్పుడు గంగానదిని వరదలు ముంచెత్తుతున్నాయి. ఇదే సమయంలో ... విరిగిపోయిన దేవతా మూర్తుల విగ్రహాలు, ఫ్రేములు తీసుకుని నదిలో వేయడానికి వచ్చాడు ఒకతను. అతన్ని చూసిన తృప్తి..''వీటిని నదిలో వేయకు. వీటిలో ఉన్న పేపర్, కార్డ్‌బోర్డ్, మట్టిబొమ్మలు నదిని మరింత కలుషితం చేస్తాయి'' అని చెప్పి అతను వాటిని నదిలో వేయకుండా వారించింది. అందుకు ఆ వ్యక్తి ఇక్కడ వేయవద్దు.. మరి వీటిని ఏం చేయాలి?'' అంటూ చికాకు పడ్డాడు. అప్పటికేదో సమాధానం చెప్పి అతణ్ణి పంపింది కానీ తృప్తి మనసులో కూడా 'అవును వీటిని ఏం చేయాలి?' అన్న ఆలోచన మొదలైంది. కొద్దిరోజులు తర్వాత వీటిని రీ సైకిలింగ్ చేసి ఇతర వస్తువులు తయారు చేయవచ్చన్న ఆలోచన తట్టింది తనకు. తన ఐడియాను కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగుతో పంచుకుంది. అంతా ప్రోత్సహించేసరికి .. పాత దేవతామూర్తుల విగ్రహాలు రీసైకిల్ చేయడం ప్రారంభించింది.

> "దేవతల విగ్రహాల ఫొటోఫ్రేములను చక్కగా అలంకరించి నిష్ఠగా పూజిస్తారు. ఇటువంటి ఫ్రేములు పాడైతే పడేయాల్సిందే. ఇది నచ్చకే సంపూర్ణమ్‌ను తీసుకొచ్చాను. దేవుడి విగ్రహాలను శాస్త్రోక్తంగా నిమజ్జనం చేసిన తరువాతే రీసైక్లింగ్ చేస్తున్నాను. వాట్సాప్, ఫేస్‌బుక్‌ల చాలా మంది కస్టమర్లు నన్ను సంప్రదిస్తున్నారు. 2019 నుంచి ఇప్పటిదాకా వేల సంఖ్యలో రీసైక్లింగ్ చేసి పర్యావరణాన్ని కాపాడాను. అదేవిధంగా దేవుడి పటాలకు మంచి రూపాన్ని ఇవ్వడం ఎంతో తృప్తినిస్తోంది".
> – తృప్తి గైక్వాడ్

సంపూర్తిగా...

విగ్రహాలను రీసైక్లింగ్ చేసేందుకు 'సంపూర్ణమ్' పేరిట స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసింది. సంపూర్ణమ్ టీమ్ దేవతామూర్తుల పాతవిగ్రహాలు, ఫొటోఫ్రేములను గుళ్లు, చెట్లకింద పడి ఉన్న వాటిని, ఇళ్లనుంచి సేకరిస్తుంది. ఈ విగ్రహాలను పూర్తిగా పొడిచేసి మొక్కలకు ఎరువులా మారుస్తారు. ఎరువుగా పనికిరాని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కలిసిన మట్టిని కుండలు, పాత్రలు, ఇటుక రాళ్లగా తయారు చేస్తారు. వీటితో పక్షులు, జంతువులకు గూళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా తయారైన పాత్రల్లో పక్షులు, జంతువులకు ఆహారం, తాగునీటిని అందిస్తున్నారు.



సంపూర్ణమ్ సేవలను మహారాష్ట్రలోని పూనే, నాసిక్, ముంబై, సోలాపూర్, సంగమ్నేర్‌లకు విస్తరించింది తృప్తి. ఇటీవల ఇతర రాష్ట్రాల్లో సైతం సేవలను ప్రారంభించింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ద్వారా ఈ రీసైక్లింగ్ గురించి అవగాహన కల్పిస్తోంది.

ఆకర్షణీయమైన టాయిస్..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కలిసిన విగ్రహాలను పొడిగా మార్చి, ఈ పొడికి కొద్దిగా సిమెంట్‌ను కలిపి టాయిస్‌ను రూపొందిస్తున్నారు. మురికివాడల్లోని నిరుపేద పిల్లల ద్వారా పాతవిగ్రహాలు, ఫొటోఫ్రేమ్‌లనూ సేకరిస్తూ వారికి ఆర్థికంగా సాయపడుతోంది.

న్యూస్ మేకర్

కల్లోల ఇజ్రాయెల్‌లో ఇండియన్ సూపర్ ఉమెన్



బతికి ఉంటే బలుసాకు తిని బతకవచ్చు... అనుకునే భయానక పరిస్థితుల్లో ఉండి కూడా, తమకు ఏమైనా ఫరవాలేదు, నిస్సహాయులైన వృద్ధదంపతులకు ఏమీ కాకూడదని వారిని కంటికి రెప్పలా కాపాడారు ఇజ్రాయెల్‌లో హోమ్ నర్స్‌లుగా పనిచేస్తున్న కేరళకు చెందిన సబిత, మీరా మోహన్‌లు...

దక్షిణ ఇజ్రాయెల్...
గాజా సరిహద్దుకు రెండో కిలోమీటర్ల దూరంలో ఉన్న నిర్ ఓజ్ కిల్బట్జ్ పట్టణంలో ఒక ఇంట్లో...

85 సంవత్సరాల షొలిక్, 76 సంవత్సరాల రహెల్ దంపతులకు నలుగురు పిల్లలు. పిల్లలు వేరు వేరు ప్రాంతాలలో ఉంటున్నారు. రహెల్ అనారోగ్యంతో బాధ పడుతోంది. ఆమెను చూసుకోవడానికి ఆరోజు ఆ ఇంట్లో సబిత, మీరా మోహన్ అనే ఇద్దరు హోమ్‌నర్స్‌లు ఉన్నారు.

ఉదయం ఆరున్నర ప్రాంతంలో సైరన్ మోత వినిపించింది. ప్రజలు బాంబ్ షెల్టర్‌లలో తల దాచుకోవాలని చెప్పే సైరన్ అది.

'ఆ ఉదయం సైరన్ మోగేసరికి గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. సెకండ్ల వ్యవధిలో సేఫ్టీరూమ్‌లోకి వెళ్లాలి. ఇంతలో రహెల్ కుమార్తె నుంచి ఫోన్ వచ్చింది. బయట పరిస్థితి భయానకంగా ఉంది అని ఆమె చెప్పింది. మాకు ఏం చేయాలో తోచలేదు. ఇంటి ముందు, వెనుక తలుపులకు తాళాలు వేసి అమ్మానాన్నలను తీసుకొని, పాస్‌పోర్ట్, డైపర్‌లు, యూరిన్ పాట్, మందులతో సెక్యూర్ రూమ్‌లోకి వెళ్లాలని ఆమె చెప్పింది. షొలిక్, అనారోగ్యంతో ఉన్న రహెల్‌ను నడిపించుకుంటూ షెల్టర్ రూమ్‌లోకి వెళ్లాం. ఈలోపే మిలిటెంట్‌లు ఇంట్లోకి ప్రవేశించారు. అద్దాలు బద్దలు కొట్టారు. వస్తువులు ధ్వంసం చేశారు. షెల్టర్‌రూమ్‌పై కాల్పులు జరుపుతున్నారు. ఐరన్ డోర్ వెనకే మా శరీరాలను గట్టిగా ఆనించి ఎన్నో గంటలపాటు నిల్చున్నాం. అదృష్టవశాత్తు ఐరన్ డోర్ ధ్వంసం కాలేదు. ధ్వంసం అయి ఉంటే ఎవరి ప్రాణాలు మిగిలేవి కావు' అంటూ ఆ భయానక ఘటనను గుర్తు తెచ్చుకుంది 39 సంవత్సరాల సబిత.



• మీరా మోహన్, సబిత

కేరళకు చెందిన సబిత, మీరా మోహన్‌ల సాహసం, మానవత్వం గురించి ఢిల్లీలోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం 'ఇండియన్ సూపర్ ఉమెన్' అంటూ ప్రశంసించింది.

టిప్స్



● రెండు కర్పూరం బిళ్లలు, మూడు కప్పుల వేపాకుల్లో కొద్దిగా కొబ్బరి నూనె వేసి పేస్టుచేయాలి. ఈ మిశ్రమాన్ని చుండ్రు ఉన్న ప్రాంతంలో రాసి మర్దన చేయాలి. చుండ్రు బాధ క్రమంగా తగ్గిపోతుంది. కర్పూరం పొడిని ఆలివ్ నూనెలో వేసి కలిపి జుట్టుకు పట్టించినా చుండ్రు తగ్గుతుంది.
ఈ రెండింటిలో ఏదైనా ఒకటి వారానికి మూడుసార్లు చేస్తే ఉపశమనం త్వరగా వస్తుంది.

● కాలివేళ్ల సందుల్లో గాలి తగలక పాచిపడుతుంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే...కాళ్లను శుభ్రంగా కడిగి, తడిలేకుండా తుడవాలి. ఇప్పుడు టూత్‌పేస్టుని వేళ్ల సందులో రాయాలి. రోజూ పడుకునేముందు ఇలా చేస్తే కాళ్లు పాయవు.



హాబీతో వయసును ఓడించాను



రవి బాల శర్మ

సాధారణంగా 65 ఏళ్ల వయసులో మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పి అంటూ బాధ పడేవారిని చూస్తుంటాం. కానీ, రవి బాల శర్మ బాలీవుడ్ తారలకు దీటుగా డ్యాన్సులు చేస్తూ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్నారు. ఆమె అసలు పేరుకన్నా 'డాన్సింగ్ దాదీ'గా ఫేమస్ అయ్యింది. మహిళలే కాదు యువత కూడా ఆమె డ్యాన్స్ స్టెప్పులకు ఆశ్చర్యపోతూ ఫాలో అవుతున్నారు. ఈ వయసులో పూజలు చేసుకోకుండా డ్యాన్సులు ఏంటి అనేవారికి మీలో స్కిల్స్ లేకనే ఇలాంటి విమర్శలు చేస్తున్నారని ఘాటుగా సమాధానం చెబుతుంది. ఇంతకీ ఎవరీ రవి బాల శర్మ...

''నా పేరు ముందు రవి అని అబ్బాయిల పేరు ఉంటుంది. మా చెల్లి పేరు శశి ప్రభ శర్మ అంటే చంద్రుడు. నా పేరులో సూర్యుడు ఉండాలని రవి అని నాన్న అనుకున్నారట. అందుకే బాల అనే నా పేరు ముందు రవి చేర్చారు. చాలా మంది నా పూర్తి పేరు తెలుసుకోకుండా మిస్టర్ అని సంబోధిస్తుంటారు. నేను స్కూల్ టీచర్‌గా చేసే రోజుల్లో ప్రమోషన్ జాబితాలో నా పేరు కనిపించలేదు. విషయమేంటని ఆరా తీస్తే మగ టీచర్ల జాబితాల్లో నా పేరు ఉందని తెలిసింది.

సంగీత వారసత్వం

ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో పుట్టి పెరిగాను. మా ఇంట్లో ఎప్పుడూ సంగీత వాతావరణం ఉంటుంది. మా నాన్న సంగీత ఉపాధ్యాయుడు. అనేక వాద్యాలను వాయించేవాడు. ఆయన దగ్గరే శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నాను. మా అమ్మ కూడా చాలా బాగా పాడేది. కానీ, పిల్లల పెంకంలో ఆమె ఎప్పుడూ బిజీగా ఉండేది. మా నాన్న కొడుకు, కూతురు అనే తేడా చూడలేదు. నా కూతుళ్లు తమ కాళ్లపై తాము నిలబడగానే పెళ్లి చేస్తానని చెబుతుండేవాడు. దీంతో ఎవరిపైనా ఆధారపడాల్సిన అవసరం రాలేదు. పాడటమే కాకుండా కథక్ డ్యాన్స్‌లో శిక్షణ తీసుకున్నాను. సితార్, తబలా కూడా వాయిస్తాను. హిందీలో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్నాను. 27 ఏళ్లుగా ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలలో మ్యూజిక్ టీచర్‌గా ఉన్నాను. పెళ్లయ్యాక ఇల్లు, పిల్లలు, స్కూలు బాధ్యతలతో బిజీ అయిపోయాను. నా ఆసక్తుల గురించి పట్టించుకోలేదు. స్కూల్లో పిల్లలకు సంగీతం నేర్పించడంలో ఎంతో సంతృప్తి ఉండేది. కానీ, సంగీతం టీచర్లకు మిగతా టీచర్లకు ఉన్నంత ప్రాధాన్యత ఉండేది కాదు.







కొడుకుతో కలిసి..

నా భర్తకు కేన్సర్ అని తెలియగానే కుప్పకూలిపోయాం. అతని మరణం నన్ను బాగా కుంగదీసింది. కూతురికి పెళ్లయ్యింది. మా అబ్బాయి ఏకాంష్ రచయిత, నటుడు. దీంతో అతనితో పాటు ముంబై వచ్చాను. లాక్డౌన్ సమయంలో మా అబ్బాయి సోషల్ మీడియా అకౌంట్‌ను క్రియేట్ చేశాడు. నన్ను విషాదం నుంచి తేరుకునేలా చేసేందుకు కొన్ని వీడియోలు షూట్ చేసేవాడు. ఆ తర్వాత వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ప్రారంభించాడు. వాటిని చూసి, వస్తున్న ప్రశంసలు చూసి నేనూ చాలా ఎంజాయ్ చేయడం మొదలుపెట్టాను. మొదట్లో పెద్దగా వ్యూస్ రాకపోయినా తర్వాత ఫేమస్ అయ్యాను.

వైరల్ అయిన విధం..

గాయకుడు, గేయ రచయిత దిల్జీత్ దోసాంజ్ పాటకు డ్యాన్స్ చేసి, ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తే, ఆ వీడియోను అతను షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. నా డ్యాన్స్ టాలెంట్ నన్ను సోషల్ మీడియాకు 'డ్యాన్స్ దాదీ'ని చేసింది. లక్షలాది మంది అభిమానులను తెచ్చిపెట్టింది.

బాలీవుడ్ తారలు

ఏ నటి పాటతో డ్యాన్స్ చేసినా ఆమె నా వీడియోను షేర్ చేసేంతగా పేరు రావడం నిజంగా ఆశ్చర్యమనిపించింది. ఈ వయస్సులో డ్యాన్స్ చేయడం చూసి వాళ్లూ ఆశ్చర్యపోతుంటారు. కానీ నా వయస్సును హాబీకి దూరంగా ఉంచుతున్నాను. నృత్యం నా హాబీ. అది నన్ను నా మనసులో ఎప్పుడూ యవ్వనంగా ఉంచుతుంది. నా డ్యాన్స్ వీడియోలు చూసిన తర్వాత చాలామంది మహిళలు 'మీ నుంచి చాలా స్ఫూర్తి పొందుతున్నామ'ని చెబుతుంటారు. చాలా మంది యువకులు కూడా నా డ్యాన్స్ ఫాలో అవుతున్నారు. కొందరు మాత్రం 'ఈ వయసులో పూజలు చేసుకోకుండా, డ్యాన్స్ ఎందుకు, నడుం పట్టేస్తుంది జాగ్రత్త' అని కామెంట్స్ చేస్తుంటారు. అలాంటి వారికి నేను భయపడను. వారికి డ్యాన్స్‌లో స్కిల్ లేదు. కాబట్టి, వారికి ఆ కళ తెలియదు. విమర్శించేవారు వారి వ్యక్తిగత చిరాకుల కారణంగానే అలాంటి కామెంట్స్ చేస్తారు అనిపిస్తుంది. కొందరికి ఇష్టం ఉన్నా తమలో ఉన్న బిడియం వల్ల డ్యాన్స్ చేయలేరు. ఇంకొందరు తమకు నచ్చినది ఇతరులు చేయడం చూస్తే 'నేనెందుకు చేయలేకపోయాను' అని బాధపడతారు. ఇది ఒకరకమైన మానసిక రుగ్మత తప్ప మరొకటి కాదు. అలాంటి వారిపై మన శక్తిని వృథా చేయకూడదు. ఎందుకంటే అది మనల్ని ముందుకెళ్లకుండా ఆపుతుంది.





వయసు ఓ సంఖ్య మాత్రమే!

హృదయంలో పిల్లల్లాగే ఉండి, హాబీస్‌తో జీవిస్తున్నట్లయితే మిమ్మల్ని ముందుకు వెళ్లకుండా ఎవ్వరూ ఆపలేరు. అదే, ఎన్నో విషాదాలను వెనక్కి నెట్టేస్తుంది. మీ హాబీ మిమ్మల్ని యంగ్‌గా ఉండటానికి సహాయపడుతుంది. ఇలాంటప్పుడు వయసు తన ప్రభావాన్ని చూపడంలో ఎప్పుడూ ఫెయిల్ అవుతుంది. నేను డాన్స్ చేయకపోతే వయసు నన్ను ఓడించేది. కానీ, నా హాబీని సజీవంగా ఉంచుకుని, దానిని పూర్తి స్థాయిలో జీవించడం ద్వారా వయసును ఓడించాను'' అని ఆనందంగా తెలియజేస్తారు ఈ డ్యాన్సర్.